ప్రజాశక్తి

శుక్రవారం 12 డిసెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

శిలాఫలకాలు.. భూమి పూజలు

- నేడు విశాఖకు సిఎం చంద్రబాబు
- రుషికొండ, కాపులుప్పాడలో పలు కార్యక్రమాలు
- విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై అధికారులతో భేటీ
- ప్రభుత్వ, డి.పట్టా భూముల సేకరణ అజెండాగా సమీక్ష
- మరో ముంబయిలా విశాఖను తీర్చిదిద్దే దిశగా ప్రణాళిక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఐటి రంగానికి పెద్ద ఊపు నిచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోంది. ఈ మేరకు ఐటి సంస్థ కాగ్నిజెంట్ తొలుతగా విశాఖలో తన కార్యకలాపాలను నిర్వహించే దిశగా కదులుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉదయం 10గంటలకు రుషికొండ ఐటి పార్కులోని హిల్ - 2పై మహతి ఫిన్‌టెక్ భవనంలో కాగ్నిజెంట్ తాత్కాలిక ఆఫీసును ప్రారంభించేందుకు విశాఖకు విచ్చేస్తున్నారు. అనంతరం హిల్ నెంబర్3లోగల శ్రీటెక్ సంస్థకు భూమి పూజ, అక్కడ నాన్ రైల్ టెక్నాలజీస్, ఎపిఎన్ ఇన్ఫోటెక్ శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు. అక్కడి నుంచి హిల్ నెంబర్ 4కు చేరుకుని సత్వా ఐటి కంపెనీకి శంకుస్థాపన చేయనున్నారు. మదర్‌సన్ టెక్నాలజీస్, క్వార్క్ టెక్నోసాఫ్ట్ సంస్థ శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు. కాగ్నిజెంట్‌కు కాపులుప్పాడలో 22 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. రూ.1600కోట్ల పెట్టుబడితో ఎఐ టెక్నాలజీ సెంటర్‌ను ఇక్కడ ఆ సంస్థ అభివృద్ధి చేయనుంది. వేల సంఖ్యలో ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం చెబుతోంది. ఐటి పార్క్ హిల్ నెంబర్4పై సత్వకు సుమారు 30 ఎకరాలు కేటాయించారు. ఐటి డవలపర్స్ ఐటి స్పేస్, డేటా సెంటర్ ఏర్పాటు చేయనుందని తెలుస్తోంది. రూ.1500కోట్ల పెట్టుబడి ఈ సంస్థ పెట్టనుంది. ఇది ఒక రియల్ ఎస్టేట్ సంస్థగా బెంగళూరులో గుర్తింపు ఉంది. కాపులుప్పాడలో ఇమ్మాజినేటివ్, ఫ్లూయెంట్

మిగతా 2లో..

కైలాసగిరిపై ఎకో హైట్స్ ప్రాజెక్ట్

విఎంఆర్‌డిఎ చైర్మన్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ విశాఖపట్నంలోని కైలాసగిరిపై ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో మరో భారీ పర్యాటక ప్రాజెక్ట్‌కు ఆమోదించినట్లు విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్‌గోపాల్, కమిషనర్ ఎన్.తేజ్ భరత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎకో హైట్స్ కాటేజీలు, 360 డిగ్రీల రివాల్వింగ్ ఫైన్-డైన్ రెస్టారెంట్, బే వ్యూ కేఫ్‌ల అభివృద్ధి' పేరుతో చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్ విశాఖ పర్యాటక రంగానికి కొత్త ఆకర్షణగా నిలవనుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను కైలాసగిరిపై విఎంఆర్‌డిఎకు చెందిన 1.99 ఎకరాల స్థలంలో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో 18 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, గత నెల 29న జరిగిన అథారిటీ సమావేశంలో ఈ ప్రాజెక్ట్‌కు ఆమోదం లభించిందని వారు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో ముఖ్యంగా ఎకో హైట్స్ కాటేజీలు, నగరం, సముద్రం 360 డిగ్రీల దృశ్యాన్ని అందించే రివాల్వింగ్ రెస్టారెంట్, బే వ్యూ కేఫ్ నిర్మాణాలు ఉంటాయని వివరించారు. ఈ ప్రాజెక్టు ఎం/ఎస్ ట్రేజట్ ఇన్ఫ్రా లిమిటెడ్ సంస్థతో కలిసి పిపిపి విధానంలో ఉంటుందని తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లింపునకు జివిఎంసి వెబ్ పోర్టల్

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఇంటి, ఖాళీస్థలముల పన్ను జివిఎంసి వెబ్ పోర్టల్ (gvmc.gov.in) ద్వారా ప్రజలు సులభతరంగా చెల్లించవచ్చని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. క్రెడిట్/డెబిట్ కార్డులు/ నెట్ బ్యాంకింగ్ / యుపిఐ లేదా యుపిఐ క్యూఆర్ కోడ్ (భారత్ పే, గూగుల్ పే, ఫోన్ పే, అమెజాన్ పే, పేటియం క్రెడ్ పే) తదితరాల మాధ్యమాల ద్వారా ఆస్తిపన్ను చెల్లింపు సదుపాయం కల్పించినట్లు వివరించారు. నగరములోని గృహ యజమానులు / ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకొని ఎటువంటి భౌతిక ఇబ్బందులు లేకుండా, వారి విలువైన సమయం వృథా కాకుండా, నేరుగా, సులభంగా జివిఎంసికి చెల్లించవచ్చని పేర్కొన్నారు.

రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రత్యేక చర్యలు : లోక్‌సత్తా

వార్త 2లో..

16 నుండి రసజ్ఞ జాతీయ నాటకోత్సవాలు

వార్త 2లో..

వెలంపేట మురికివాడలో పేదలకు బహుళ అంతస్తుల ఇళ్లు

వార్త 8లో..

బలవంతంగా భూసేకరణ చేపట్టొద్దు

వార్త 8లో..

మాట్లాడుతున్న నాగబాబు

పదవులు రాలేదని కార్యకర్తలలో ఆవేదన : నాగబాబు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వంలో ఉన్నప్పటికీ జనసేనలో ఎంతో కాలంగా పనిచేస్తున్నా పదవులు రాలేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తపరచడం యదార్థమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అన్నారు. జనసేన విశాఖ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జగదాంబ జంక్షన్ సమీపంలోని అంబికా బాగ్ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉండటం వల్ల అవకాశాలు పొందటంలో హెచ్చుతగ్గులు ఉండవచ్చన్నారు. జనసేన లేకపోతే ఈరోజు రాష్ట్ర రాజకీయాలు లేవు అనే విధంగా పార్టీ ఎదిగిందని చెప్పారు. ఉత్తరాంధ్రలో జనసేన పార్టీని బలోపేతం చేయాలని దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఎచ్చెర్ల నుండి ప్రతి నియోజకవర్గంలోనూ

మిగతా 2లో..

ఆహ్లాదకరంగా విశాఖ బాలోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సెయింట్ ఆంథోనీ తెలుగు మీడియం ప్రైమరీ పాఠశాలలో జరుగుతున్న విశాఖ బాలోత్సవం- 2025 మూడవ రోజు గురువారం ఆహ్లాదకరంగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు ఉత్సాహంతో పాల్గొని బాలోత్సవ వేదికను రంగరించారు. పిల్లల్లో సృజనాత్మకత, చాతుర్యం, భాషా నైపుణ్యాలు, శాస్త్రీయ ఆలోచనలను వెలికితీయడంపై దృష్టి సారించే అంశాలపై పోటీలు నిర్వహించారు. బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ - వ్యర్థాలను ఉపయోగించి సమాజానికి ఉపయోగపడే వస్తువుల తయారీ, రైమ్స్, పద్యం భావవ్యక్తీకరణ, ఫైర్‌లెస్ కుకింగ్ (మంట లేని వంట), క్విజ్ (జూనియర్స్, సీనియర్స్) పోటీలు నిర్వహించారు. మొదటి రౌండ్ రాత పరీక్ష, రెండో రౌండ్ మౌఖికంగా నిర్వహణలో ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు సభ్యులతో బృందాలుగా పాల్గొన్నారు. సాంస్కృతిక విభాగంలో దేశభక్తి, జానపద, క్లాసికల్ నృత్యాలతో సందడి చేశారు. చిన్నారుల ఉత్సాహం వేదికను మరింత ప్రాచుర్యం పొందేలా చేసింది. ఈ బాలోత్సవం విద్యార్థులలో సమిష్టి తత్వం, సామాజిక అవగాహన, దేశభక్తి, పర్యావరణం పట్ల బాధ్యతను పెంచే విధంగా కార్యక్రమాలు

ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

రూపొందించడం హర్షించదగిన విషయం. చిన్నారులకు స్పాట్‌లో ఇచ్చిన కొన్ని సృజనాత్మక అంశాలు కూడా ఆకట్టుకున్నాయి. మట్టితో బొమ్మలు - జూనియర్స్ అంశం, 'పంట పొలం' చిన్న ప్రపంచం (పువ్వు-ఆకు-చెట్టు-పక్షి గూడు), తెలుగు మాట్లాడే కార్యకలాపాలు, చిన్నారుల ప్రతిభను ప్రతిబింబించే కోలాటం, ఫ్యాన్సీ డ్రెస్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విశాఖ బాలోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడానికి పాఠశాలల సహకారం, ఉపాధ్యాయుల సమన్వయం, చిన్నారుల ప్రతిభ కలిసి చిరస్మరణీయ వాతావరణాన్ని సృష్టించాయి.

నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

25వ వర్ధంతి

కీ॥శే॥ శ్రీ కల్లి శంకర్‌రెడ్డి గారు MCA
Mech./C&W.S.E.Rly, VSP

ఓం నమ:శివాయ ఓం నమ:శివాయ ఓం నమ:శివాయ
మీరు మానుండి దూరమై నేటికి 25 సం॥లు గడిచినను...
మీ మధురస్మృతులు ప్రతిరోజు, ప్రతి నిమిషము
స్మరించుకుంటూ.. మీకు మా నివాళులు అర్పిస్తున్నాం.

భార్య : కల్లి లక్ష్మి
కుమారుడు : నిహార్‌బాబు, B.Tech, MBA
కుమార్తె : డా॥ ప్రణీత MBBS
అల్లుడు : పిల్లి సంతోష్‌కుమార్‌రెడ్డి
చెల్లెళ్ళు : అనురాధ (అమ్మాజీ)
చాముండేశ్వరి (ఛాఛా)
బావలు : జి.నాగేశ్వరరావు, బి.భవానిశంకర్
మనుమడు : పి.రేయాన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి..

శిలాఫలకాలు.. భూమి పూజలు

గ్రిడ్, మదర్‌సన్ టెక్నాలజీస్, క్వార్క్స్, టెక్నోసాఫ్ట్ సంస్థలు ఏర్పాటు కానున్నాయి. విశాఖకు చెందిన ఫ్లూయెంట్ గ్రిడ్‌కు కాపులుప్పాడలో 3 ఎకరాలకు పైగా కేటాయించారు. ఇంకా పలు సంస్థలకు భూములు కేటాయించగా వాటన్నిటికీ శంకుస్థాపనలు సిఎం చేపట్టనున్నారు. 2026 మార్చిలో విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారని తెలుస్తోంది. ఇప్పటికే దీనికోసం డి పట్టా భూములను తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైన సంగతి తెలిసిందే.

విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై చర్చ...

(విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ మొత్తం 8 జిల్లాలు) విశాఖ ప్రాంతాన్ని 'గ్రోత్ హబ్'గా మార్పుచేసి మరో ముంబయిలా మార్చేందుకు కార్యాచరణ చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇదివరకే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సిఎం చంద్రబాబు జిల్లా ఉన్నతాధికారులందరిని రుషికొండకు రప్పించి భేటీ అవుతున్నారు. అటు ఐటి సంస్థలకోసం, ఇటు ఎకనమిక్ రీజియన్ ఏదైనా గానీ భూ సేకరణే ప్రధాన అజెండాగా ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది.

నీతి అయోగ్ ప్రణాళిక ప్రకారం గ్రీన్ ఎనర్జీ, ఐటి, హెల్త్ కేర్, డేటా సెంటర్లు వంటివి విశాఖ రీజియన్‌లో ఏర్పాటు చేయడం ద్వారా 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషిచేస్తున్నట్లు వెల్లడించారు. 20వేల ఎకరాలను ఇందుకోసం ప్రభుత్వ సేకరించేందుకు సన్నాహాలు చేస్తుంది. విశాఖ జిల్లాలో పరిశ్రమల కోసం 5వేల ఎకరాలను, ఎకనమిక్ రీజియన్ అభివృద్ధి కోసమూ సేకరించేందుకు జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. విశాఖ పరిసర మండలాల్లో వెయ్యి ఎకరాల వరకూ సమీకరణకు వుడా సిద్ధమవుతుండగా, ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం, పెందుర్తి మండలాల్లో ప్రభుత్వ, డి పట్టా భూములు, కొండవాలు ప్రాంత భూములున్నట్లు గుర్తించారు.

పదవులు రాలేదని కార్యకర్తల్లో ఆవేదన : నాగబాబు

తాను పర్యటిస్తున్నానన్నారు. పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తామని చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్పొరేషన్ ఎన్నికలు రానున్నాయని, జనంలో బలంగా ఉన్నప్పుడు మాత్రమే మనం గెలిచే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, కందుల నాగరాజు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఎ.రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

కేసుల పరిష్కారానికి 43 బెంచీలు ఏర్పాటు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు సూచనల మేరకు ఈ నెల 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి 43 బెంచీలు ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి న్యాయసేవా సధన్, న్యాయ సేవా అధికార సంస్థ గురువారం చిట్ ఫండ్ కంపెనీల ప్రతినిధులతో సన్యాసినాయుడు ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ లోక్ అదాలత్‌లో చెక్ బౌన్స్, ఇతర రాజీపడదగిన కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కరించేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. త్వరితగతిన, ఉచితంగా, సౌహార్ధపూర్వక వాతావరణంలో న్యాయం పొందడానికి జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రాల వారీగా విశాఖపట్నం (ప్రధాన కేంద్రం)-18 బెంచీలు, 10 మండల న్యాయ సేవా కమిటీలలో 25 బెంచీలు ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. కక్షిదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రత్యేక చర్యలు

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో రెవెన్యూ శాఖలో అంతులేని అక్రమాలు చోటు చేసుకున్నాయని, అధికారుల అలసత్వం కూడా అదే స్థాయిలో ఉందని వీటిని తొలగించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. లోక్‌సత్తా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రెవెన్యూ రికార్డుల్లో తప్పులు, రీ సర్వేలో జరిగిన పొరపాట్లు, పట్టాదారు పాస్ పుస్తకం, మ్యూటేసన్‌తో పాటు ప్రతి చిన్న పనికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగలేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. భూముల ధరలు పెరగటంతో పట్టణాల్లో, పల్లెల్లో ఆక్రమణలు ఊహించని రీతిలో పెరిగిపోయాయని తెలిపారు. కలెక్టర్, జెసి, డిఆర్ఒ, ఆర్‌డిఒలు ప్రభుత్వం అప్పచెప్పిన పనులతో పాటు విసి, టిసిలతో నిత్యం బిజీగా ఉంటున్నారని, సామాన్యులను కలవడానికి కనీసం సమయం ఇవ్వడం లేదని, చిన్నపాటి సమస్యను కూడా పట్టించుకునే పరిస్థితి లేదని మండిపడ్డారు. పిజిఆర్ఎస్ ద్వారా అనుకున్నంత ప్రయోజనం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ సమస్యలతో పాటు వివాదాస్పద భూముల పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో ఒక సీనియర్ ఐఎఎస్ అధికారిని నియమించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ రాసిన రెవెన్యూ పరిపాలనలో జరగాల్సిన సంస్కరణలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు, సమావేశంలో లోక్ సత్తా విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎమ్ఎస్ఎన్.మూర్తి, ఆయలసోమయాజుల నాగభాస్కరం పాల్గొన్నారు.

16 నుండి రసజ్ఞ జాతీయ నాటకోత్సవాలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ ఈ నెల 16వ తేదీ నుండి మూడు రోజుల పాటు మద్దిలపాలెం కళాభారతి వేదికగా బహు భాషా నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. ఈ నాటకోత్సవాల పోస్టర్‌ను గురువారం సాయంత్రం తన ఛాంబర్‌లో మేయర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖల సమన్వయంతో ఈ బహు భాషా నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తొలి రోజు మంగళవారం కోలాటం, జానపద నృత్యాలు ఉంటాయని పేర్కొన్నారు. విశిష్ట సేవా పురస్కారాలను తెలుగు యూనివర్సిటీ ఆచార్యులు బిహెచ్.పద్మప్రియకు, పాండిచేరి యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ పవిత్రకు, ఎయు అతిథి అధ్యాపకురాలు డి.హేమా వెంకటేశ్వరికి ప్రదానం చేస్తారని తెలిపారు. అనంతరం ఒకే ఒక్క సారి తెలుగు నాటకం బి.శ్రీనివాసరావు రచనను బి.మంజునాథ్ దర్శకత్వంలో సిరిమువ్వ కల్చర్స్ హైదరాబాద్ సభ్యులు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. 17వ తేదీన బెంగాలీ సంప్రదాయ జానపద నృత్యాలు, అదే రోజు కొన్ని బంగ్లా / హిందీ పాటలు కూడా ఆయా గాయకులు పాడుతారని వివరించారు. చిత్రాంగద నృత్య నాటకం విశాఖ బెంగాలీ కళాకారులు ప్రదర్శిస్తారని తెలిపారు. డాలియా బెంగాలీ నాటకం డెబాసిస్ దత్ దర్శకత్వంలో ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. 18వ తేదీన స్నిగ్ధ రాసిన ధన్యోస్మి నాటకం డాక్టర్ వేమలి త్రినాథరావు, డి.హేమా వెంకటేశ్వరి దర్శకత్వంలో రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ సభ్యులు ప్రదర్శిస్తారని తెలిపారు. అనంతరం దండు నాగేశ్వరరావు రాసిన ముళ్ళ తీగలు నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలకు ఎలాంటి ప్రవేశ రుసుం లేదని రసజ్ఞ వ్యవస్థాపక అధ్యక్షుడు వేమలి త్రినాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత పీలా తిలక్, అక్షర సారధి జర్నలిస్ట్ బొడ్డేటి సూర్యచంద్రశేఖర్, రాపేటి గోవింద్ పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో తల్లిపాల ప్రాముఖ్యతపై వర్క్‌షాప్

మార్చి నాటికి హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రా మెడికల్ కాలేజీ పీడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ నియోకాన్ సదస్సులో భాగంగా "అడ్వాన్స్‌డ్ లాక్టేషన్, హ్యూమన్ మిల్క్ బ్యాంకింగ్"పై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 50 మందికి పైగా వైద్య ప్రతినిధులు హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సంతోష్, డాక్టర్ వీణా, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ లక్ష్మి,కాశీనాథ్ తదితరులు శిక్షకులుగా వ్యవహరించారు. తల్లిపాలు ఇవ్వడంలో తలెత్తే సమస్యలు, ఆధునిక పరిష్కార మార్గాలు, హ్యూమన్ మిల్క్ బ్యాంకింగ్ ఆవశ్యకతను వివరించారు. పాలు పట్టడంలో ఇబ్బందులు ఉన్న తల్లులకు సహాయపడే అధునాతన పద్ధతులపై డెలిగేట్‌లకు "హ్యాండ్స్-ఆన్ స్కిల్స్" శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సంధ్యాదేవి ఒక ప్రత్యేక బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కెజిహెచ్‌లో మార్చి 2026 నాటికి అత్యాధునిక "హ్యూమన్ మిల్క్ బ్యాంక్" ను ప్రారంభించబోతున్నట్లు ఆమె ప్రకటించారు. ఇది తల్లిపాలు లేని శిశువులకు అమృతతుల్యమైన ఆహారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినందుకు పీడియాట్రిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బిఎస్. చక్రవర్తి అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కెజిహెచ్‌లో ఇటువంటి సదుపాయాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

'హై రిస్క్ న్యూబోర్న్' వర్క్‌షాప్ విజయవంతం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రా మెడికల్ కాలేజీ పీడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ నియోకాన్ సదస్సులో భాగంగా 'హై రిస్క్ న్యూబోర్న్ న్యూరోడెవలప్‌మెంటల్ ఫాలో-అప్" అంశంపై గురువారం నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్ విజయవంతమైంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి సుమారు 50 మందికి పైగా వైద్య నిపుణులు హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కన్యా ముఖోపాధ్యాయ్, డాక్టర్ ఎన్‌బి.మాథూర్, డాక్టర్ ఐవి.పద్మావతి, డాక్టర్ సెంథిల్ తదితరులు పాల్గొన్నారు. నవజాత శిశువులలో మెదడు సంబంధిత ఎదుగుదల లోపాలను ముందస్తుగా ఎలా గుర్తించాలో వివరించారు. సరైన సమయంలో సమస్యను గుర్తించడం ద్వారా భవిష్యత్తులో పిల్లలకు రాబోయే తీవ్రమైన వైకల్యాలను ఎలా నివారించవచ్చో తెలియజేశారు. శిశువులలో ప్రమాదకర సంకేతాలను గుర్తించడానికి అవసరమైన "హ్యాండ్స్-ఆన్ టెక్నిక్స్"పై డెలిగేట్‌లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అమియల్ టిసన్, హ్యామర్‌స్మిత్ వంటి అంతర్జాతీయ స్థాయి పరీక్షా విధానాలను నేర్పించారు. ఈ కార్యక్రమం విజయవంతం అయినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, పాల్గొన్న ఫ్యాకల్టీకి, డెలిగేట్‌లకు ఆంధ్రా మెడికల్ కాలేజీ పీడియాట్రిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి కృతజ్ఞతలు తెలిపారు. కెజిహెచ్ పీడియాట్రిక్స్ విభాగం ఇటువంటి అధునాతన శిక్షణా కార్యక్రమాల ద్వారా వైద్య సేవలను మరింత మెరుగుపరుస్తోందని ఆయన పేర్కొన్నారు.

ది డైమండ్ స్టోర్ బై చందుభాయ్‌లో 'ఏడు వారాల నగలు'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ది డైమండ్ స్టోర్ బై చందుభాయ్ సంస్థ ప్రాచీన భారత రాజరిక సంప్రదాయాల ప్రకారం వారసత్వ వధువుల నగల సమాహారాన్ని ఆవిష్కరించిందని ఆ సంస్థ ప్రతినిధి కొట్టి శ్రీకాంత్ తెలిపారు. .చారిత్రక 'ఏడు వారాల నగల' సంప్రదాయానికి ఆధునిక రూపు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఏడు వారాల వజ్రాల-నవరత్నాల నగలను 22 వేలకుపైగా సహజ వజ్రాలు, శుద్ధమైన నవరత్నాలతో రూపొందించామని విశాఖలో జరిగిన కార్యక్రమంలో తెలిపారు. గోవాలో జరిగిన ఒక ప్రముఖ హైదరాబాదీ వధువు వివాహ వేడుకల్లో ఈ ఆభరణాన్ని అలంకరించుకోగా, అది వివాహ ఉత్సవాలకు ప్రధాన ఆకర్షణగా నిలిచిందన్నారు.

నేడు అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, అనవసరమైన యాప్‌లను తొలగించాలని, ఇతర సమస్యల పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రసాయనిక భద్రతపై శిక్షణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ సౌజన్యంతో రెండు రోజులు పాటు కెమికల్, పెట్రో కెమికల్ ఇండస్ట్రియల్ సేఫ్టీ అంశంపై నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం గురువారం గ్రీన్ పార్క్ హోటల్‌లో ప్రారంభమైంది. మొదటి రోజు కార్యక్రమాన్ని ఐఐపిఇ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్, జెటి చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్ రెడ్డి, సిఐపిఇటి హెడ్ డాక్టర్ సిహెచ్.శేఖర్ ప్రారంభించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అత్యంత ప్రమాదాలు జరిగే కేటగిరీలో గల 60 రసాయన పరిశ్రమల నుండి 108 మంది భద్రత అధికారులు పాల్గొన్నారు. పారిశ్రామిక భద్రతా చర్యలు, నిబంధనలు అంశంపై వక్తలు ప్రసంగించారు. ప్రమాద అంచనా, ప్రమాద నిర్వహణ, అత్యవసర ప్రణాళిక, ప్రతిస్పందన వ్యూహాలు, భద్రతా పద్ధతుల్లో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు తదితర అంశాలపై 11 సెషన్‌లు నిర్వహిస్తారు. వీటిలో సిఐపిఇటి నిపుణులు, పరిశ్రమ నిపుణులు, ఐఐటిలు, ఐఐపిఇ, ఎన్‌డిఆర్ఎఫ్ విషయ నిపుణుల ద్వారా వివరణాత్మక శిక్షణను అందిస్తున్నట్లు డాక్టర్ సిహెచ్.శేఖర్ తెలిపారు.

5న సామ్‌సంగ్ సిఇఎస్‌లో డిఎక్స్ విజన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ సిఇఎస్ 2026 జనవరి 5న "ది ఫస్ట్ లుక్" ఈవెంట్లో తన డిఎక్స్ (డివైస్ ఎక్స్పీరియెన్స్) విభాగానికి సంబంధించిన 2026 విజన్‌ను వెల్లడించనుందని ఆ సంస్థ ప్రతినిధి రాహుల్ విశాఖపట్నంలోని కార్యాలయంలో మీడియాకు తెలిపారు. ఈ ఈవెంట్ జనవరి 5 ఉదయం 8:30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎక్స్ విభాగం హెడ్ టిఎం రోహ్ ముఖ్య వక్తగా ఉంటారని తెలిపారు. స్విస్ యాంగ్ (విజువల్ డిస్‌ప్లే అధ్యక్షుడు) చెయోల్గి కిమ్ (డిజిటల్ అప్లయిన్సెస్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్) భవిష్యత్తులో వ్యాపార దిశలను పంచుకుంటారని పేర్కొన్నారు. జనవరి 7వ తేదీ వరకు విన్ లాస్ వెగాస్లో సామ్సంగ్ ప్రత్యేక ప్రదర్శనలో మరిన్ని ఈవెంట్స్ జరుగుతాయని తెలిపారు.

బివికె ప్రచార ప్రముఖ్‌గా త్రినాథరావు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : భారతీయ విద్య కేంద్రం విశాఖపట్నం ప్రచార విభాగ ప్రముఖ్‌గా సీనియర్ వీడియో జర్నలిస్టు, వైజాగ్ విజన్ ఛానల్ అధినేత మళ్ల దేవా త్రినాథరావు నియమితులయ్యారు. ఈ మేరకు బివికె సంస్థ ఈఓ బుధవారం త్రినాథ్‌కు లేఖ అందచేశారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ, తాను విద్యనభ్యసించిన సంస్థలో కీలక బాధ్యత స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. సంస్థ లక్ష్యాలు, సిద్ధాంతాలకు భంగం కలుగకుండా వార్తాపత్రికలు, టీవీ, సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా బివికె పేరుప్రఖ్యాతులు పెంపొందించేలా పనిచేస్తానని చెప్పారు.

కోర్టు వాయిదాకు కార్మిక నేతలు

హైదరాబాద్ ట్రిబ్యునల్ కోర్టుకు హాజరైన కార్మిక నేతలు

ప్రజాశక్తి-గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు తొలగింపుపై హైదరాబాద్ ట్రిబ్యునల్ కోర్టులో కేసు వేసిన కార్మిక సంఘాల నాయకులు గురువారం వాయిదాకు వెళ్లారు. కేసును వచ్చేనెల 21కి వాయిదా వేసినట్లు కార్మిక నేతలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, మాట్లాడుతూ ఏవిధమైన నోటీసు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఉక్కు కాంట్రాక్టు కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. 25ఏళ్ల సర్వీస్, నైపుణ్యం ఉన్న కార్మికులని కాదని, ఇతర రాష్ట్రాల కార్మికులను తీసుకోవడం సరికాదన్నారు తాము వేసిన కేసుపై విచారణకు ఉక్కు యాజమాన్య ప్రతినిధులు కోర్టుకు హాజరు కాలేదున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వాల మోసాలు గ్రహించి కార్మికులంతా పోరాటానికి సిద్ధంకావాలని కోరారు. కోర్టుకు హాజరైన వారిలో సిఐటియు నాయకులు వివి.రమణ, ఐఎన్‌టియుసి నాయకులు బి.భాస్కరరావు, పి అవుతారం, గోపి. నగేష్, కాంట్రాక్టు కార్మికుల అసోసియేషన్ ప్రతినిధులు సన్యాసిరావు, రామకృష్ణ ఉన్నారు.

రెండో విడత చందన దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో రెండో విడత చందనదీక్షలో వందలాది మంది భక్తులుచందన మాలాధారణ చేశారు. దీక్షాపరులకు ఆలయ ఇఒ ఎస్.సుజాత ఆదేశాల మరకు చందన దీక్షా మాలలను అందజేశారు ఆలయ స్థానాచార్యుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు ఆధ్వర్యంలో చందన మాలాధారణ, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు, ఎఇఒ డాక్టర్ టిపి, రాజగోపాల్, ఎఇఒ కె తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణ అధికారి కంచి మూర్తి, ప్రధానార్చకులు, అర్చక, నాదస్వరబృందం, వేదపండితులు పాల్గొనగా, మాడవీధుల్లో ప్రదక్షిణ చేశారు.

సౌత్‌జోన్ మహిళల టిటి విజేత జైన్ వర్సిటీ

పతకాలు, ప్రశంసాపత్రాలతో విజేత జైన్ వర్సిటీ క్రీడాకారులు

ప్రజాశక్తి-మధురవాడ : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న సౌత్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్ టెన్నిస్(పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్ పోటీలలో తమిళనాడుకు చెందిన పలు విశ్వవిద్యాలయాల జట్లు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. ఫైనల్స్‌లో తమిళనాడుకు చెందిన ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయంపై కర్ణాటకకు చెందిన జైన్ విశ్వవిద్యాలయం 3-2 స్కోరుతో విజయం సాధించి సౌత్ జోన్ ఛాంపియన్‌గా నిలిచింది. ఎస్ఆర్ఎమ్ విశ్వవిద్యాలయం రన్నరప్‌గా నిలిచింది. తమిళనాడుకు చెందిన అన్నా విశ్వవిద్యాలయం మూడవ స్థానంలో, మద్రాస్ విశ్వవిద్యాలయం నాలుగవ స్థానాలలో నిలిచాయి. పోటీలలో విజేతలైన జట్లు తెలంగాణాలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే ఎఐయు అఖిల భారత మహిళల టిటి ఛాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించాయి.

ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ సభకు గీతం ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పాల్గొని విజేతలను అభినందించి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో గీతం కేంపస్ లైఫ్ అసోసియేట్ డీన్ అరుణ్‌కార్తీక్, గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరెక్టర్ జి. శ్రీనివాస్, గీతం క్రీడా విభాగం సీనియర్ మేనేజర్ కె.తపశ్వి, ఎస్.రితేష్ పాల్గొన్నారు. ఈ పోటీలలో క్రీడాకారిణులు అత్యున్నత స్థాయి ప్రతిభను కనబరిచారని విశాఖపట్నం టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ డివిఎస్‌వై. శర్మ తెలిపారు.

బిల్లు బకాయి చెల్లించాలని నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : బిల్లు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 'నోబిల్, నో వర్క్' నినాదంతో జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద గురువారం స్థానిక కాంట్రాక్టర్లు నిరసన తెలిపారు జివిఎంసి కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఒకటో జోన్ అధ్యక్షులు ఆర్ భాస్కరప్రసాద్,ప్రధాన కార్యదర్శి ఆర్ రవి మాట్లాడుతూ, జి 20, యోగాంధ్ర, భాగస్వామ్య సదస్సులు, సమ్మిట్ లు నిర్వహణ నేపథ్యంలో అధికారుల కోరిక మేరకు అప్పులు చేసి పనులు చేపట్టామని గుర్తు చేశారు నిర్దిష్ట గడువులోగా అప్పగించిన పనులను పూర్తి చేస్తున్నా, తమకు బిల్లులు సకాలంలో చెల్లించక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గడచిన 13 నెలలుగా బకాయి ఉన్న కోట్ల రూపాయల బిల్లులు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు సంక్రాంతి పండుగకు చెల్లింపులు చేయాల్సిన నేపథ్యంలో కనీసం 6 నెలల బిల్లు బకాయిలైనా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కాంట్రాక్టర్లు ప్రసాదరాజు, ప్రసాద్ పాల్గొన్నారు

వైభవంగా సింహాద్రి అప్పన్న కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్న ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వామి నిత్య కల్యాణ వేడుకను దేవస్థానం అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం కల్యాణక్రతువు నిర్వహించారు. లోక కల్యాణార్థం నిర్వహించిన సింహాద్రి అప్పన్న కల్యాణంలో పాల్గొన్న భక్తులకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేసి తర్వాత స్వామి అంతరాలయ దర్శనం కల్పించినట్లు దేవస్థానం ఇఒ ఎస్.సుజాత తెలిపారు.

నేరాలు ఘోరాలు

ప్రమాద కారకుడైన లారీ డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష, జరిమానా

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : అతివేగంగా డ్రైవింగ్ చేసి ఒక వ్యక్తి మృతికి కారకుడైన లారీ డ్రైవర్‌కు ఏడాది కఠినకారాగార శిక్ష, రూ.ఆరు వేలు జరిమానా విధిస్తూ విశాఖపట్నం చీఫ్ జ్యుడిషియల్ న్యాయమూర్తి ఎం. ప్రదీప్ కుమార్ గురువారం తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. మృతుని కుటుంబానికి పరిహారం చెల్లించాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీని ఆదేశించారు. కేసులో వాదనలు వినిపించిన సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలుపల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలివి.

గతేడాది ఫిబ్రవరి 12న అధిక వేగంతో లారీని నడిపి విశాఖ వ్యాలీ స్కూలు సిగ్నల్ పాయింట్ వద్ద బైకిస్ట్‌ను ఢీకొట్టి, గుడ్లవానిపాలేనికి చెందిన రోజువారీ పనులు పూర్తిచేసుకుని వెళ్లిన ద్విచక్ర వాహనంపై వెళుతున్న మీనా అనే వ్యక్తి మృతికి కారణమయ్యాడు. దీనిపై మృతుని తండ్రి, జన్ని చలపతిరావు ఫిర్యాదు మేరకు అరిలోవ పోలీస్‌లు కేసు నమోదు చేసి, ఎస్ఐ శ్రీకాంత్ విచారణ చేసి, చార్జ్‌సీట్ దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి, నేరం రుజువు కావడంతో ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్‌కు జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి -నక్కపల్లి: డంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 12 మంది వాహనదారులకు ఎలమంచిలి కోర్టు న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ఎస్ఐ సన్నిబాబు, ట్రైనీ ఎస్ఐ సాహిబా అంజుమ్ తెలిపారు. నక్కపల్లి సిఐ మురళి ఆధ్వర్యంలో చేపట్టిన వాహన తనిఖీలో మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిని పట్టుకుని కేసులు నమోదు చేశారు. విచారించిన న్యాయమూర్తి ఒకరికి రూ. 10 వేల జరిమానా, ఒకరికి 7 రోజులు జైలు శిక్ష విధించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 8 మందికి జరిమానా విధించినట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గ్రీష్మ

గ్రీష్మను అభినందిస్తున్న హెచ్ఎం, తదితరులు

ప్రజాశక్తి-తగరపువలస : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర యూనివర్సిటీ మైదానంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలలో భీమునిపట్నం మండలం మజ్జిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కోరాడ గ్రీష్మ సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చిల్ల.కైలాస్‌రెడ్డి తెలిపారు. గ్రీష్మను పాఠశాల హెచ్ఎం ఎం.జయలక్ష్మి, సర్పంచ్ మజ్జి సూర్యనారాయణ, ఎంపిటిసి మజ్జి శ్రీను. మాజీ సర్పంచ్ ఎం వెంకట్రావు, అభినందించారు

క్రీడలతో పిల్లలకు ఆరోగ్యం

ప్రజాశక్తి -గాజువాక. : పిల్లలు చదువుతోపాటు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆల్ ఇండియా మెగాస్టార్ చిరంజీవి ఫౌండేషన్ ఫ్రీ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖలో ప్రాముఖ్యత కలిగిన గాజువాకలో ప్రత్యేక గుర్తింపు పొందిన కొన్ని ప్రైవేట్ పాఠశాలలలో ఎస్ఎస్ పాఠశాల ఒకటనాా్రఉ. విద్యతోపాటు ఆటపాటల్లో తర్ఫీదునివ్వడం ద్వారా ఎస్ఎస్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయక్రీడల్లో రాణిస్తున్నారన్నారు. బాక్సింగ్, రెజ్లింగ్, తైక్వాండో వంటి క్రీడాలకుఉచిత కోచింగ్ ఇస్తున్న చీఫ్‌కోచ్ డాక్టర్ పి. రుక్మాకరరావును అభినందించారు. అనంతరం రుక్మాకరరావు మాట్లాడుతూ విద్యతోపాటు ఆరోగ్యాన్ని అందించేలా 8-28 ఏళ్ల మధ్య యువత, విద్యార్థులకు తమ ట్రస్ట్ తరపున జూడో, బాక్సింగ్, రెజ్లింగ్, తైక్వాండో, సైకిల్ పోలో, ఆడపిల్లలకు ఆత్మరక్షణ, ధ్యాన తరగతులపై ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్-ఎస్ పాఠశాల ప్రిన్సిపల్ కంటిమహంతి రమణయ్య గోవింద్, కరస్పాండెంట్ కంటి గోవిందరావు, గాజువాక నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రసాదుల శ్రీనివాసరావు,కార్పొరేటర్ రాజాన రామారావు, ఐలా డైరెక్టర్, పాఠశాల ఉపాధ్యాయులు డి ప్రసాదరావు, చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా విశాఖ

కాగ్నిజెంట్ శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించిన భీమిలి ఎమ్మెల్యే గంటా

ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే గంటా,ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేష్

ప్రజాశక్తి -మధురవాడ : ఐటీ గమ్యస్థానమైన విశాఖ రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజన్ కానుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కాపులుప్పాడలో కాగ్నిజెంట్ కంపెనీ శంకుస్థాపనకు ఈనెల 12న సిఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో గురువారం సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు, హైదరాబాద్‌లకు ధీటుగా విశాఖను అంతర్జాతీయ ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ ప్రయత్నిస్తున్నారని చెప్పారు శుక్రవారం . సీఎం చంద్రబాబు కాగ్నిజెంట్ భవన శంకుస్థాపన చేస్తారని, సత్వా, టెక్ తమ్మిన, ఇమేజనేటివ్, ఫ్లూయంట్ గ్రిడ్ కంపెనీలకు లోకేష్ శంకుస్థాపన చేస్తారన్నారు. గత నెలలో రహేజా, వరల్డ్ ట్రేడ్ సెంటర్ తదితర 5 కంపెనీలకు లోకేష్ శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ గేమ్ తరహాలో విశాఖకు గూగుల్ డేటా సెంటర్ ఐటీ గేమ్ చేంజర్ కానుందన్నారు. వైసిపి హయంలో ఆంధ్రా అంటే భయపడి, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలకు తరలివెళ్లిన పారిశ్రామికవేత్తలు, ఇపుడు చంద్రబాబు సమర్థమైన నాయకత్వంతో ఆంధ్రప్రదేశ్ వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. రెండు రోజుల విశాఖ సమ్మిట్‌లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం ఇందుకు నిదర్శనమన్నారు. అనంతరం ఏ1 గ్రాండ్‌లో సీఎం శుక్రవారం సమీక్షించే విశాఖ రీజియన్ ఎకనామిక్ జోన్ సమావేశ ఏర్పాట్లను కూడా గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. కార్పొరేటర్లు లొడగల అప్పారావు, పివి.నరసింహం, జెడ్‌పిటిసి గాడు వెంకట ప్పడు, కూటమి నేతలు చిక్కాల విజయ్‌బాబు, మొల్లి లక్ష్మణ రావు, వాండ్రాసి అప్పలరాజు, గరే గుర్నాథ్, చెట్టిపల్లి సన్యాసిరావు, బోయి రమాదేవి, దొరబాబు పాల్గొన్నారు.

పశువైద్యశాల నూతన భవనం ప్రారంభం

ఆనందపురం: ఆనందపురం మండల కేంద్రంలో దివీస్ కంపెనీ సిఎస్ఆర్ నిధులు రూ. 38.52 లక్షలతో నిర్మించిన పశువైద్యశాల నూతన భవనాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. శిథిలభవనంతో సేవలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పశువైద్యశాల భవన నిర్మాణానికి నిధులు సమకూర్చిన దివీస్ యాజమాన్యం, కంపెనీ జిఎం వైఎస్ .కోటేశ్వరరావును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పశు గ్రామీణ అభివృద్ధి ఛైర్మన్ గాడు వెంకటప్పడు, దివిస్ జనరల్ మేనేజర్ వైఎస్. కోటేశ్వరరావు, డిప్యూటీ జీఎం పి.జగదీష్, సిఎస్ఆర్ మేనేజర్ సురేష్, జేడీ శంకర్రావు, డీడీ చంద్రశేఖర్, పశువైద్యాధికారులు సంతోష్, అశ్విని, శాంతికుమార్, భీమిలి ఎఎంసి ఛైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు, చిక్కాల విజయబాబు, తాట్రాజు అప్పారావు, లోడగల రాజేశ్వరి రమణ, బీఆర్‌బీ నాయుడు, బమ్మిడి ఉమా, బలిరెడ్డి మల్లికార్జునరావు, బంటుబిల్లి శ్రీను, గోవిందరావు రౌతు వెంకట్రావు, లోడగల వెంకట్రావు, కర్రి శ్రీను, పిఎసిఎస్ ఛైర్మన్లు గంగ్రెడ్డి సోంబాబు, పాండ్రంకి అప్పలరాజు, రౌతు నాగరాజు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మోడల్ పేపర్లు అందజేత

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఇఒ, యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి -పద్మనాభం :మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు గురువారం యుటిఎఫ్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. అనుభవజ్ఞులైన సబ్జెక్ట్ టీచర్స్‌తో యుటిఎఫ్ రూపొందించిన ఎస్ఎస్‌సి స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్లను యూనియన్ మండలశాఖ అధ్యక్షుడు ఎంవివిఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. సంజయ్‌బాబు, జిల్లా గౌరవాధ్యక్షులు పైడిరాజు, కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంఇఒ పి రమణ ఆవిష్కరించి, విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ, టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణతోపాటు మంచి మార్కులు సాధించేందుకు స్టడీ మెటీరియల్ ఉపయోగపడుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యుటిఎఫ్ కృషి, సేవాభావాన్ని అభినందించారు కార్యక్రమంలో ఎస్ వెంకటేశ్వరరావు,చిన్నా రావు ,శ్రీనివాస్ రావు భాస్కరరావు పి వి రమణ, సన్యాసిరావు , ప్రభాకర్ రావు డి రాజు, ప్రభావతి, ఝాన్సీ కాంచన భారతి మమతా ఉమామహేశ్వరి వసంత కుమారి పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

ప్రజాశక్తి - విశాఖ లీగల్ : జిల్లా న్యాయవాదుల సంఘం గ్రంథాలయంలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎంకె.శ్రీనివాస్ కృషితో ఏర్పాటు చేసిన శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు ప్రారంభించారు..కంటి, వినికిడి, దంత పరీక్షలతోపాటు బిపి, సుగర్ ఇసిజి వంటి పలు రకాల పరీక్షలు ఫిజియోథెరపీ నేచురోపతి వంటి సేవలను అందించారు. శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి సౌజన్యంతో కంటి పరీక్షలు చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తితోపాటూ పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది 1500 మందికి పైగా వైద్యసేవలు పొందారు. న్యాయవాదులకు న్యాయశాఖ సంబంధిత ఉద్యోగులకుప్రయోజనకరమైన వైద్యశిబిరాన్ని నిర్వహించిన న్యాయవాదుల సంఘాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజు అభినందించారు.

ఢిల్లీ జంతర్‌మంతర్ ధర్నాలో పెన్షనర్లు

ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న చిట్టివలస పెన్షనర్లు

ప్రజాశక్తి -తగరపువలస : తమ సమస్యల పరిష్కారానికి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద గురువారం నిర్వహించిన ఇపిఎస్ 95 పెన్షన్‌దారుల ధర్నాలో చిట్టివలస పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు ఆధ్వర్యంలో పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు. కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, రైల్వే ప్రయాణ రాయితీలు, మెడికల్ బెనిఫిట్స్, హయ్యర్ పెన్షన్ అందరికీ వర్తింపు వంటి పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ అప్పలనాయుడు. దల్లి.రాంబాబు, వేముల అప్పలరెడ్డి, పట్నాల సత్యం, డి.పెంటయ్య ఇప్పాక సూరిబాబు పాల్గొన్నారు

సిఐటియు అఖిల భారత మహాసభ

జయప్రదానికి ఇంటింటా ప్రచారం

చోడవరంలో పోస్టరు ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు

ప్రజాశక్తి-చోడవరం : విశాఖలో జరగనున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభ వాల్ పోస్టర్‌ను గురువారం చోడవరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్న సిఐటియు అఖిలభారత మహాసభలు ఈ ప్రాంతంలో జరగటం ఎంతో ఆనందదాయకమన్నారు. మహాసభలకు జిల్లాలోని కార్మిక వర్గం పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. వచ్చేనెల 4వ తేదీన విశాఖపట్నంలో మహా ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌వి నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, బి రామలక్ష్మి, సంధ్య, కె. వరలక్ష్మి, కాంతం, దేవుళ్ళ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా నిధి సేకరణ

ములగాడ : సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని జివిఎంసి . 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో సిఐటియు కార్యకర్తలు ప్రచారం చేశారు. ఇంటింటా నిధి వసూలు చేపట్టారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమంలో సిఐటియు కార్యకర్తలు దున్న రాజేష్, కె.రమణ, బి రాంబాబు, ఎం.శ్రీను.జి.రామకృష్ణ, ప్రశాంత్, జె. ఈశ్వరరావు, పి.సురేష్, డి రాజు తదితరులు పాల్గొన్నారు.

ములగాడలో ఇంటింటా నిధి సేకరణలో సిఐటియు శ్రేణులు

విరాళం అందజేసిన ఆటో యూనియన్

కె.కోటపాడు : సిఐటియు ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని ఆకాంక్షిస్తూ మండలంలోని ఆనందపురం సెంటర్లో గల శ్రీవిఘ్నేశ్వర ఆటో యూనియన్ (కొత్తవలస రోడ్డు) నాయకులు 1000 రూపాయలు విరాళాన్ని గురువారం సిఐటియు నాయకులకు అందజేశారు. జనవరి నాలుగో తేదీ జరుగు బహిరంగ సభకు 10 మంది హాజరవుతామని చెప్పారు. కార్యక్రమలో సిఐటియు మండల నాయకులు రొంగలి ముత్యాల నాయుడు, ఈర్లే నాయుడు బాబు, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఆర్.రాజు. కే.అమ్మతల్లి నాయుడు, బి.రవి, ఎల్.కృష్ణ పాల్గొన్నారు.

కె.కోటపాడులో విరాళం అందిస్తున్న ఆటో కార్మికులు

13న బీచ్ వాక్

విశాఖ కలెక్టరేట్ : సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం ఆర్‌కె.బీచ్‌లో బీచ్ వాక్ నిర్వహించనున్నట్లు సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరిగే ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇప్పటికే విస్తృత క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దానిలో భాగంగా శనివారం ఉదయం 6:30 గంటలకు ఆర్‌కె బీచ్ కాళీమాత టెంపుల్ నుండి వైఎంసిఎ వరకు "బీచ్ వాక్" జరుగుతుందని వివరించారు. ఈ బీచ్ వాక్‌లో కార్మికులతోపాటు విద్యార్థులు, యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 1600 మంది వివిధ యూనియన్లకు ప్రాతినిధ్యం వహిస్తూ హాజరవుతారని తెలిపారు. జనవరి 4వ తేదీన ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి ఆర్‌కె.బీచ్ వరకు కార్మిక మహా ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతాయని పేర్కొన్నారు. ఈ మహాసభలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి విశాఖపట్నంలోని కార్మికులు, ప్రజలు, విద్యా, వాణిజ్య సంస్థలు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు.

ఐద్వా నేత అన్నపూర్ణ మృతికి సంతాపం

అన్నపూర్ణ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ సీనియర్ నాయకులు వి.కృష్ణమూర్తి సతీమణి ఐద్వా నేత, సిపిఎం సభ్యురాలు వి. అన్నపూర్ణ బుధవారం రాత్రి అకాల మరణం పొందారు. అన్నపూర్ణ మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, బలరాం, సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గసభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, వి.కృష్ణారావు, ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ పూర్వ మేనేజర్ ఎస్. సుధాకర్, ఐద్వా రాష్ట్ర నాయకులు బి. పద్మ. 78వవార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ తదితరులు అన్నపూర్ణ మృతికి సంతాపాన్ని తెలిపారు. అన్నపూర్ణ కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు. ఒక్క నిమిషం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా సిహెచ్. నరసింగరావు మాట్లాడుతూ అన్నపూర్ణ, కృష్ణమూర్తి సిపిఎంలో చేరి ఆరిలోవ ప్రాంత ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేసారన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో కృష్ణమూర్తి పూర్తికాలం కార్యకర్తగా పనిచేసారని,. ఆయన అడుగుజాడల్లో అన్నపూర్ణ స్థానికంగా పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణానికి మంచి సేవలందించారన్నారు. ఇద్దరూ చివర వరకు పార్టీతో ఉండి అంకితభావంతో ప్రజాసేవ చేసారన్నారు. అన్నపూర్ణ ఆశయాలు కొనసాగిస్తామన్నారు. స్థానిన నాయకులు వి.నరేంద్రకుమార్, పి.శంకర్, బి. సూర్యమణి, నాగరాజు పాల్గొన్నారు.

హెచ్ఎం శివజ్యోతి చొరవతో

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం శివజ్యోతి

ప్రజాశక్తి-తగరపువలస : చిట్టివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్థానిక ప్రధానోపాధ్యాయురాలు టి.శివజ్యోతి కృషితో గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రవాస భారతీయుడు ఉప్పులూరి రామచౌదరి విద్యార్థులు స్టడీ మెటీరియల్‌కు సహాయం అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శివజ్యోతి మాట్లాడుతూ, స్టడీ మెటీరియల్‌ను సద్విని యోగం చేసుకుని వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు.స్టడీ మెటీరియల్‌కు సాయమందించిన రామ చౌదరికి హెచ్ఎం శివజ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.

జెఎల్‌ఎంలుగా విలీనంపై హర్షం

కేకు కట్ చేసి ఆనందం వ్యక్తం చేస్తున్న జెఎల్‌ఎంలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఎనర్జీ అసిస్టెంట్లను జూనియర్ లైన్ మేన్స్ (జెఎల్‌ఎం) గా విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం డిస్కం ఎగ్జిక్యూటివ్ మెంబర్ షినగం పాపునాయుడు తెలిపారు. గురువారం మండలంలోని సెక్షన్ కార్యాలయంలో జెఎల్‌ఎంలుగా ఉత్తర్వులు అందుకున్న సందర్భంగా సెక్షన్ అధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. జెఎల్‌ఎంలంతా ఆనందం వ్యక్తం చేసి, పరస్పరం శుభాకాంక్షలు అందుకున్నారు. కార్యక్రమంలో సబ్‌ఇంజనీర్ ఈశ్వరరావు, లైన్ ఇన్స్పెక్టర్ బివిఎస్ రామారావు, మధుకుమార్, నాయుడు బాబు, అర్జున్, రమేష్, రమణ, ప్రకాశ్ పాల్గొన్నారు

పద్మనాభం : ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ ఇమ్మడి ఉత్తర్వుల మేరకు డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో జెఎల్‌ఎంల విలీన ప్రక్రియ ప్రారంభం కావడంపై తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం, విద్యుత్తు కార్మిక సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వానికి యూనియన్ జిల్లా అధ్యక్షులు వేదుల నగేష్ ధన్యవాదాలు తెలిపారు. గురువారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద యూనియన్ జిల్లా అధ్యక్షులు వేదుల నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేకులు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, యువగళంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయంతో వీరికి ఉద్యోగ భద్రత, వేతన స్కేలు, సర్వీసు నిబంధనలు, ప్రమోషన్లు వంటి అవకాశాలు వస్తాయన్నారు. ఇకపై జెఎల్‌ఎంలుగా మరింత సేవాభావంతో, బాధ్యతతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో సెక్షన్ అధికారి జగన్ మోహన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లగుంట ముస్లిం శ్మశానవాటికపై రాజకీయ పడగ

- నిలిచిన ప్రహరీ నిర్మాణ పనులు
- రియల్ ఎస్టేట్, గ్రావెల్ మాఫియా ప్రయోజనాల కోసమేనని ఆరోపణలు
- ఆందోళన చెందుతున్న ముస్లిం సమాజం

గొల్లగుంట ముస్లిం శ్మశానవాటికలో వందల ఏళ్ల నాటి సమాధులు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని రావాడ గ్రామ పంచాయతీ పరిధి గొల్లగుంట ముస్లిం శ్మశానవాటిక చుట్టూ రాజకీయ పడగ చుట్టుకుంది. ఈ శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులను అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి నిలుపుదల చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్మశానవాటిక భూమిలో రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు, గ్రావెల్ తరలింపునకు స్కెచ్‌లో భాగంగానే ప్రహరీ నిర్మాణ పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

400 ఏళ్లనాటి ముస్లిముల శ్మశానం

గొల్లగుంట గ్రామానికి చెందిన 67 సెంట్లు ముస్లిం శ్మశానవాటిక అచ్యుతాపురం మండలం నడింపల్లి రెవిన్యూ సర్వే నెంబర్ 2లో ఉంది. ఈ శ్మశానవాటికలో సుమారు 400 ఏళ్ల నాటి ముస్లిం సమాధులు ఉన్నాయి. వాటిపై చెక్కిన ప్రాచీన గుర్తులు నేడు చారిత్రక సూచనలుగా కనిపిస్తున్నాయి. సర్వే నెంబర్ 2లోని 20 ఎకరాలు సర్వీస్ ఇనాం భూమిగా డైగ్లాట్ రికార్డుల్లో నమోదై ఉంది. ప్రస్తుతం సర్వీస్ ఇనాం భూములు ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉన్నాయి. కాని నేడు సర్వే నెంబర్ 2లోని భూమి అంతా వెబ్‌ల్యాండ్‌లో ప్రైవేటు వ్యక్తుల పేరుతో చూపిస్తోంది.

దీంతో గ్రామస్తులు తమ శ్మశానవాటికను రక్షించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్కు, ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు అర్జీలు ఇచ్చారు. దీంతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ద్వారా అచ్యుతాపురం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేరడంతో తహసీల్దార్ ఆదేశాలతో నడింపల్లి వీఆర్ఓ, సర్వే అధికారులు సర్వే నిర్వహించి, 67 సెంట్లు స్థలం ముస్లిం శ్మశాన వాటికగా ఉందని నివేదిక సమర్పించారు. రీ-సర్వేలో శ్మశానవాటిక స్థలం రికార్డుల్లో నమోదుకు అవకాశం ఉందని తహసీల్దార్ ఎండార్స్‌మెంట్ రూపంలో ఇచ్చారు.

శ్మశానవాటికలో గతంలో అభివృద్ధి పనులు

రావాడ గ్రామ పంచాయతీ తరపున ప్రభుత్వ నిధుల ద్వారా 2009లో శ్మశానవాటికలో బోరుబావి నిర్మాణం చేశారు. 2017లో శ్మశానవాటికను వెళ్లేందుకు గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు. రావాడ గ్రామ పంచాయతీ తరుపున గొల్లగుంట శ్మశానవాటికకు లక్షల రూపాయల్లో నిధులు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో స్పష్టంగా ఉంది.

నేడు నిలిచిన ప్రహరీ నిర్మాణ పనులు

గత ఎన్నికల ప్రచారంలో గొల్లగుంట పర్యటనలో భాగంగా ప్రస్తుత ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శ్మశానవాటిక అభివృద్ధికి, ప్రహరీ నిర్మాణానికి హామీ ఇచ్చారు. ప్రజాదర్బార్‌లోనూ దీనిపై అర్జీ రావడంతో ఎమ్మెల్యే ఆదేశాలతో శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులు రూ.18 లక్షల అంచనా వ్యయం వేశారు. పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో ప్రహరీ నిర్మాణం పనులు ప్రారంభించారు. మిగిలిన నిధులు సర్దుబాటు చేస్తామని పిజిఆర్ఎస్ ద్వారా అధికారులు తెలియజేశారు. కొలమ్స్, పుటింగ్ వరకు పనులు జరిగాయి. ఏమి జరిగిందో కాని నెల రోజులుగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

నిలిచిపోయిన ప్రహరీ నిర్మాణ పనులు

రాజకీయ ఒత్తిడితోనే

కొంతమంది కూటమి నాయకులు ఎమ్మెల్యే పేరు చెప్పి అధికారులపై ఒత్తిడి తెచ్చి పనులు నిలుపుదల చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేరే మండలం పరిధిలో ప్రహరీ నిర్మాణం పనులు ఎలా చేస్తారని, పనులు ఆపాలని మండల, పంచాయతీ అధికారులపై ఒత్తిడి చేశారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఈ శ్మశాన వాటిక సేవలు పొందుతున్నది పరవాడ మండలానికి చెందిన ప్రజలు కనుక దీని అభివృద్ధి కూడా ఈ మండలం నుంచే చేపట్టాల్సి ఉంది. అలాంటిది వేరే మండలంలో పనులు చేస్తున్నారని చెప్పడంలో అర్థం లేదని, ఇది కావాలనే రియల్ ఎస్టేట్, గ్రావెల్ మాఫియాకు ప్రయోజనం చేకూర్చుదానికే పనులు నిలుపుదల చేయించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలో అక్రమ తవ్వకాలు

గత ప్రభుత్వ కాలంలో దౌర్జన్యంగా శ్మశానవాటికలో రహదారి చేసి గ్రావెల్ తరలించారు. అప్పుడు పరవాడ తహసీల్దార్‌గా ఉన్న బి.వి.రాణి 1 కోటి 15 లక్షల రూపాయల అపరాధ రుసుము విధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ శ్మశానవాటికలో గ్రావెల్ తవ్వకాలకే గ్రావెల్ మాఫియాతో కలిసి కొంత మంది అధికార పార్టీ నాయకులే శ్మశానవాటిక అభివృద్ధి పనులను అడ్డుకుంటూ స్థానిక ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేవిధంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు జోక్యం చేసుకొని, ఆయన పేరు చెప్పి అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రహరీ నిర్మాణం పూర్తి చేసి వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్మశాన వాటికను రక్షించాలని స్థానిక ముస్లిములు కోరుతున్నారు.

ఇఒపిఆర్‌డి వివరణ

గొల్లగుంట శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణం పనులు ఆగిపోవడంపై పరవాడ ఇఒపిఆర్‌డిని ప్రజాశక్తి ప్రతినిధి వివరణ కోరగా తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని, ఎంపిడిఒ ఆదేశాలు మేరకు విజిట్ చేశానని తెలిపారు. గతంలో పంచాయతీ నిధులు ఖర్చుపై రికార్డులు పరిశీలన చేస్తున్నామని, కొంత సమయం కావాలని తెలిపారు.

మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని సుందరయ్య పేట, మొండి పాలెం గ్రామాలలో ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తులకు గురువారం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల ఇన్చార్జ్ చదరం నాగేశ్వరరావు మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండానే కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకే మందులు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి భరత్ బాబు, తెలుగు యువత అధ్యక్షులు చందక నర్సింగరావు, జనసేన నాయకులు రొంగలి రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భజన మండలికి స్టీల్ క్యారేజీలు వితరణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కింతాడ పంచాయతీ పరిధి కూండ్రపు వానిపాలెం భజన మండలికి "అమ్మా మెటల్ స్టోర్" యజమాని ఇంజరపు శేషు 5,000 రూపాయలు విలువైన స్టీల్ కారేజీలను సమకూర్చారు. గురువారం జోగన్నపాలెం, కూండ్రపువానిపాలెం, రామచంద్రపురం గ్రామాల్లో కారేజీలు ద్వారా ఆహార సరఫరాను సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు కశిరెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా సహసమన్వయకర్త కన్నూరు అప్పలనాయుడు, మహిళా సేవాదళ్ సభ్యులు కశిరెడ్డి చెల్లయ్యమ్మ, అచ్చియ్యమ్మ, మంగతల్లి, నాలం వరలక్ష్మి, అమ్మాజీ, కుబిరెడ్డి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఈ నెల 21న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఈ.పూజ్యమేఘన ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజ్యమేఘన మాట్లాడుతూ పోలియో రహిత లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించడానికి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పీహెచ్‌సీ పరిధిలో గుర్తించిన 8,310 మంది ఐదేళ్ల లోపు పిల్లలకు నూటికి నూరు శాతం పోలియో చుక్కలు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎం. ఆనంద్, హెచ్ఎస్ పుష్పరాజు, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి దొరబాబుకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన రాజాన దొరబాబును గురువారం ప్రజా సంఘాల ఐక్యవేదిక నేతలు సత్కరించారు. ప్రజా సమస్యలపై అనునిత్యం స్పందించే దొరబాబు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, కొల్లి చిన్న అప్పారావు, బొడ్డు సోమరాజు, ఆడారి బుచ్చిరాము, బొబ్బిలి గోవిందరాజులు, ముగడా అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, సిపిఐ నాయకులు కోరుబిల్లి శంకర్రావు పాల్గొన్నారు.

చలి తీవ్రతతో ఇబ్బందులు

ప్రజాశక్తి-కశింకోట : చలి తీవ్రత పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తెల్లవారు జామున నుండి దట్టంగా మంచుకురుస్తోంది. దీంతో పిల్లలు, వృద్ధులు ఇంటి నుండి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. పొగ మంచు కారణంగా ఉదయం కూడా వాహనాలు లైట్లు వేసుకొని వెళ్లి వలిసి వస్తుంది. చలిని తట్టుకోవడానికి ఉన్ని దుస్తులు ధరించి ఉపసమనం పొందుతున్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : సంచార వైద్య సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏషియన్ పెయింట్స్ వారు నిర్వహిస్తున్న వైద్య సేవలను గురువారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, వార్డు సభ్యులు పి.శివ, వి చక్రం నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ అచ్చంనాయుడు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, ఫార్మాసిస్టు భార్గవ్, స్టాఫ్ నర్స్ లహరి, పైలెట్ రమేష్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీరామ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు 12 మంది ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అచ్యుతాపురంలో గురువారం అస్మిత జిల్లా స్థాయి రగ్బీ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎంపిక కార్యక్రమంలో 60 మంది క్రీడాకారులు హాజరు కాగా వారిలో మూడు గ్రూపులుగా విడదీసి 12 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా గౌరవ అధ్యక్షులు కూండ్రపు వెంకు నాయుడు తెలిపారు. ఈ పోటీలకు అనిమిరెడ్డి అర్చన, లాలం చైత్ర, కావ్య, కే.లాస్యశ్రీ, బి.నాగరత్నం, బుడ్డి కుసుమ, బి ఇందు, జి దుర్గాభవాని, జి సుధా, సీనియర్ విభాగంలో ధర్మిరెడ్డి వసంత, రొంగలి దీపిక, రాజాన బాల విష్ణుప్రియ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14న గుంటూరులో జరగబోతున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని కోచ్ వెంకట్ తెలిపారు. ఎంపికైన వారికి రగ్బీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎస్‌వి జగదీష్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డి రాజు తిరునాధరావు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కైట్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ముందు జాగ్రత్తలు వంటి వాటిని విశ్రాంత కెమిస్ట్రీ అధ్యాపకులు రామ్మోహన్‌రావు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం విశ్రాంత అగ్రికల్చరల్ సైంటిస్ట్ వీరభద్రరావు, రిటైర్డ్ ఇంజినీర్ జగన్నాధరావు, కాలేజ్ కరెస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, డైరెక్టర్స్ విల్లూరి ప్రసాద్, అడిగర్ల శంకరరావు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంపిపిగా రాజాన శేషు ఎన్నిక

ప్రజాశక్తి-యలమంచిలి, యలమంచిలి టౌన్ : యలమంచిలి మండల పరిషత్ 10వ అధ్యక్షులుగా రాజాన సూర్యచంద్రశేషగిరిరావు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్ పికెటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాజాన సూర్యచంద్ర శేషగిరిరావుతో పాటు ఎంపిటిసి సభ్యులు నగిరెడ్డి అమ్మాజీ, బర్రె శివలక్ష్మి, పొలమరశెట్టి ఉమా గణేష్ హాజరయ్యారు. వైసిపికి చెందిన మాజీ ఎంపిపి బొద్దపు గోవిందరావు, ఎంపీటీసీ పూటకోటి రామగణేష్ హాజరుకాలేదు. నిర్ణయించిన సమయం ఉదయం 11 కావడంతో ఎన్నిక నిర్వహించగా పొలమరశెట్టి ఉమా రాజాన సూర్యచంద్రశేషగిరిరావు పేరును ఎంపిపిగా ప్రతిపాదించారు. మిగిలిన నాగిరెడ్డి అమ్మాజీ, బర్రె శివాలక్ష్మి ఆమోదం తెలియజేయడంతో ఎంపిపి ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం రాజాన శేషు చేత అధికారులు ఎంపిపిగా ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కొండలరావు, ఎఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనంతరం విలేకర్లతో నూతన ఎంపిపి శేషు మాట్లాడుతూ తన పదవీ కాలం 10 నెలల కాలంలో చేయనున్న పనుల్ని వేగవంతం చేసి బాధ్యతగా వ్యవహరిస్తానని చెప్పారు. మండలంలో సర్పంచులు ఏ పార్టీకి చెందిన వారైనా సమాన భావానతో అభివృద్ధి గురించే తాను పనులు చేపడతానన్నారు. ఎంపిపి పదవి చేపట్టాలని తన జీవితాశయం భావించానని, అది నెరవేరిందని, అందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతుడునై ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు నగిరెడ్డి అమ్మాజీ, బర్రె శివలక్ష్మి, పొలమరశెట్టి ఉమా గణేష్, జనసేన నేతలు అన్నం బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



ఎంపిపి శేషును అభినందిస్తున్న ఎంపిటిసిలు, అధికారులు

పశు వ్యాధులపై పట్టించుకోని అధికారులు

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పశువులకు వ్యాధులు సోకినా పశు వైద్య శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో గురువారం ఆయన వ్యాధి సోకిన పశువులను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పశు వైద్యులు పట్టించుకోవడంలేదని నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. పశువులకు వ్యాధులు సోకి పాల ఉత్పత్తి తగ్గిపోతున్నప్పటికీ సరైన సూచనలుగానీ వైద్యం గానీ చేసే నాథుడు కరువయ్యారని విమర్శించారు. పశువులకు సోకే వ్యాధుల పట్ల పశువైద్య శాఖ నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కొండకర్ల గ్రామంలో ఐదు పాడి ఆవులు వ్యాధులు సోకి చనిపోయాయని గుర్తు చేశారు. పశువులకు పాడి పశువులకు వ్యాధులు సోకడం వలన ఐదు లీటర్లు పాలు ఉత్పత్తి చేసే ఆవులు నేడు అర లీటరు పాలు ఇస్తున్నాయని చెప్పారు. పశువులకు వైద్యం చేయించడానికి రైతులు 20 వేల రూపాయల వరకు మందులకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. నెల రోజుల క్రితం పాడి పశువులకు సోకే వ్యాధుల పట్ల సహాయక కార్యక్రమాలు, సరైన వైద్య సేవలు అందించాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి పశువులకు సోకే వ్యాధుల పట్ల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాడి రైతులు పోలారపు పారు నాయుడు, కర్రి పెంటారావు, శరగడమ రామునాయుడు, ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.



రైతులను కలిసిన రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం దిబ్బపాలెం గ్రామంలో విశాఖ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు విల్లూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో దిబ్బపాలెం, ఊడేరు, అల్లికానుడుపాలెం, మామిడిపాలెం, దర్జీనగర్, ఆర్ఏవిఎస్ కాలనీ, బవులవాడ, గ్రామాల నుంచి సుమారు 150 మందికి కంటి పరీక్షలు చేశారు. కాట్రాక్టు, ఆపరేషన్‌కు అర్హులుగా గుర్తించిన వారిని ఆపరేషన్ నిమిత్తం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి బస్సులో తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జి భీమరశెట్టి రాంకీ, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ, కూటమి నాయకులు గంగుపామ్ జగదీశ్, చదరం నాగేశ్వరావు, కర్రి బాబీ, దిబ్బపాలెం గ్రామ సర్పంచ్ పీలా ఉషా అప్పారావు, మామిడిపాలెం సర్పంచ్ పూడి పరదేసినాయుడు, ఊడేరు గ్రామ సర్పంచ్ సిరిగిరిశెట్టి కృష్ణమోహన్, వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరావు, తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు, కుంద్రం సర్పంచ్ సందారపు రమణ, నాయకులు మల్ల రాంబాబు, ఆళ్ల శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్.జగన్‌ను కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని యలమంచిలి మాజీ ఎంపిపి బోదేపు గోవిందరావు ఆధ్వర్యంలో వైసిపి మండల నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీలో వెన్నంటే నడిచిన ప్రతి ఒక్కరిని గుర్తు పెట్టుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, అరేపు గుప్తా, కౌన్సిలర్లు పిట్ల సత్తిబాబు, దాసరి కుమార్, పిల్లా త్రినాధరావు, గొర్లి వెంకట్, రాపేటి సంతోష్, కోరిబిల్లి శ్రీను,ఐరుగుల గణేష్, దుంగా అచ్చుతారావు, దూది నరసింహ మూర్తి, ఎంపీటీసీ పుటకూటి రామగణేష్ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఎఇని కలిసిన నాయకులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఇటీవల బదిలీపై వచ్చి విధుల్లో చేరిన ఏఈ ఎం.వెంకటరమణను గురువారం వడ్డాదికి చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానం చేశారు. కార్యక్రమంలో దొండ సన్యాసిరావు, గ్రంధాలయ సంస్థ డైరెక్టర్ సిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, దొండ గిరి, సయ్యపు రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు

జనసేన నేత అడపాకు కొణతాల పరామర్శ

ప్రజాశక్తి-వడ్డాది : అనారోగ్యంతో బాధపడుతున్న జనసేన సీనియర్ నేత అడపా నర్సింహామూర్తిని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గురువారం పరామర్శించారు. కొద్దిరోజుల పాటు విశాఖలో చికిత్స తీసుకున్న నరసింహామూర్తి ప్రస్తుతం వడ్డాదిలోని వారి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం ఎమ్మెల్యే వారి స్వగృహానికి వెళ్లి నరసింహామూర్తిని కలిసి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తాను ఎంపీగా రాజకీయ జీవితం ప్రారంభించినప్పటి నుండి నుంచి నర్సింహామూర్తి తనకు మంచి మిత్రుడని, తనతోనే ప్రయాణం సాగిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యపురెడ్డి సత్యనారాయణ, జనసేన నేత చదరం నాగేశ్వరరావు, సుంకర భాస్కరరావు, మినుములూరు సర్పంచ్ విశ్వేశ్, తదితరులు కొణతాల వెంట ఉన్నారు.

ఎంఎసి చైర్మన్‌కు...

అనకాపల్లి : అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ గురువారం అనకాపల్లి మండలం కూండ్రం గ్రామంలో ఉన్న రాము ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనారోగ్య పరిస్థితి నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

దేవస్థానం చైర్మన్‌కు గండి బాబ్జి...

సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం లింగాల తిరుగుడు సోమలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ దొడ్డి రామవెంకట సత్యనారాయణ అనారోగ్య సమస్యతో బాధపడుతూ విశాఖలోని పినాకిల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ గ్రోవర్స్ చైర్మన్ గండి బాబ్జీ గురువారం పినాకిల్ హాస్పిటల్‌కు వెళ్లి సత్యనారాయణ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. అవసరమైన సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. బాబ్జి వెంట సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు ఉన్నారు.

టెన్త్, ఇంటర్‌లో శత శాతం ఉత్తీర్ణతపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-సబ్బవరం : పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా వర్క్ షాప్ నిర్వహించారు. ఇందులో 65 మంది టీచర్లు, ఐదుగురు ప్రిన్సిపాళ్లు పాల్గొని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను తయారు చేసినట్లు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల గురుకుల పాఠశాలల సమన్వయ అధికారిణి బి.గ్రేసి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్బవరం అంబేద్కర్ గురుకులంలో నిర్వహించిన అవగాహన సదస్సులో రెండు జిల్లాలకు చెందిన తెలుగు, ఇంగ్లీష్, హిందీ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ను సమన్వయం చేసి, ఉపాధ్యాయులకు విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయం లేకుండా పూర్తి నమ్మకంతో పరీక్షలు రాయించే విధానంపై ప్రత్యేక శిక్షణ అందించినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ సిహెచ్.కేశవరావు మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షలకు హాజరు కావడంలో మానసికంగా, శారీరకంగా ఎలాంటి ఇబ్బంది జరగకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

పిపి.అగ్రహారంలో మళ్లీ ఉద్రిక్తత

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పిపి అగ్రహారం గ్రామంలో గురువారం మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మను గురువారం మళ్లీ కూల్చి వేశారు. గ్రామానికి 24 గంటలు విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక లైను వేస్తున్నారు. దీనిలో భాగంగా రోడ్డు పక్కన గ్రామస్తులు సిమెంట్ దిమ్మను గ్రామస్తులు ఏర్పాటు చేశారు. సమీపంలో గల భూమి యజమాని నిర్మాణాన్ని అడ్డుకోవడంతో వివాదం నెలకొంది. దీనిపై గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యేకు తహసిల్దార్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు సదరు భూమిని సర్వే చేయడంతో సిమెంట్ దిమ్మ ఏర్పాటు చేసే భూమి ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. రెండు రోజుల క్రితం గ్రామస్తులు మళ్లీ సదరు స్థలంలో నిర్మించారు. సదరు భూమి ప్రభుత్వ భూమి అని అధికారులకు ఫిర్యాదు చేసిన నైదాన అప్పారావుకు రెవెన్యూ అధికారులు ఎండార్స్‌మెంట్ సైతం ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో గురువారం గ్రామస్తులు నిర్మించిన సిమెంట్ దిమ్మను మళ్లీ ధ్వంసం చేశారు. సిమెంట్ దిమ్మను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహసిల్దార్‌కు, ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజుకు గ్రామానికి చెందిన నైదాన నాని బాబు తదితరులు ఫిర్యాదు చేశారు.

4వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-మునగపాక : మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్లోనే కొనసాగించాలని కోరుతూ మునగపాకలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి నాలుగవ రోజుకు చేరుకున్నాయి. ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం టి.శిరసపల్లి, వెంకటాపురం, తోటాడ, గవర్ల అనకాపల్లి, మడకపాలెం, చెర్లోపాలెం గ్రామాలకు చెందిన నాయకులు దీక్షల్లో కూర్చున్నారు. వైకాపా అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ దీక్ష శిబిరాన్ని సందర్శించారు. టి.సిరసపల్లి గ్రామానికి చెందిన సేవ గరిడి సంఘం (మహిళలు) సేవ చేస్తూ దీక్షా శిబిరానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైకాపా మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, సుందరపు నీలకంఠ స్వామి, దిమ్మల అప్పారావు, ఆడారి లక్ష్మణరావు, గోపి, ముసలి నాయుడు, రాజాన బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల సాగుపై అవగాహనుండాలి

ప్రజాశక్తి-కశింకోట : వ్యవసాయ కళాశాల విద్యార్థులకు క్షేత్రస్థాయిలో పంట సాగుపై అవగాహన ఉండాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు అన్నారు. మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆధ్వర్యంలో గురువారం రైతు సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన్న ముకుందరావు మాట్లాడుతూ విద్యార్థులు రైతులు నుండి వ్యవసాయం సంబంధించి అన్ని విషయాలు తెలుసుకోవాలన్నారు. పుస్తకాల్లో చదివింది కన్నా పొలంలో నేర్చుకుంది ముఖ్యమని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వర రావు, ఏడిఏ సుబ్రమణ్యం, రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ రమణ మూర్తి, మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

ప్రజాశక్తి-దేవరాపల్లి : యువత మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని దేవరాపల్లి ఎస్సై వి.సత్యనారాయణ విద్యార్థులను కోరారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిహెచ్ ఉమా, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి సెక్షన్ 33/11కెవి యలమంచిలి సబ్ స్టేషన్, రాంబిల్లి రూరల్, యలమంచిలి టౌన్ 2 ఫీడర్ పరిధిలో గల యలమంచిలి పట్టణంలో లైన్ మెయింటనెన్స్ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్క్రబ్ టైఫస్ వ్యాధి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో దేవరాపల్లి గ్రామ పంచాయతీ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధి ప్రభావాన్ని తగ్గించే లక్ష్యంతో గురువారం పంచాయతీ సెక్రటరీ అనంత ఉమాదేవి, మెడికల్ టీం సంయుక్త ఆధ్వర్యంలో అల్లిపురం గ్రామంలోని హేబిటేషన్‌లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా గ్రామ పరిసరాలను పూర్తిగా శుభ్రపరిచారు. బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించి, దోమలు, కీటకాల అబేట్ ద్రావణం పిచికారీ చేయించారు. పొలాలకు వెళ్లే రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పంచాయతీ సెక్రటరీ అనంత ఉమాదేవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అధిక లోడుతో వెళ్తున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట పోలీస్ స్టేషన్ సిఐ అల్లు స్వామి నాయుడు, అనకాపల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లీలా ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఒక లారీని సీజ్ చేసి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రూ.65000 ఫైన్ వేశారు. పరిమితికి మించి లోడ్ వేసుకున్నట్లయితే తగిన చర్యలు తీసుకుంటామని వాహన డ్రైవర్లను హెచ్చరించారు.

స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-సబ్బవరం : నాయీ బ్రాహ్మణ సంఘానికి స్థలం కేటాయించాలని కోరుతూ స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం జనసేన మహిళా నాయకురాలు బంటికోళ్ల పద్మ ఆధ్వర్యంలో శ్రీదుర్గాదేవి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సమస్యలను చర్చించుకోనేందుకు, సమావేశాలకు తమకు ఎటువంటి భవనం లేదని, శ్రీదుర్గాదేవి నాయీబ్రాహ్మణ సేవాసంఘం తరుపున కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సబ్బవరం గ్రామంలో 10సెంట్లు విస్తీర్ణం స్థలం మంజూరు చేయాలని కోరారు. జనసేన నాయకులు ఇందల వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కర్రి కనకరాజు, టి.శేఖర్, కిల్లి వెంకట సత్యనారాయణ, పల్లి మంగరాజు, కొల్లి కృష్ణ, జి.మన్మధరావు, ఎన్.కొండబాబు సంఘం సభ్యులు పాల్గొన్నారు

'ఎపి పంచాయతీ రాజ్ మినిస్టీరియల్' ఎన్నికలు

ప్రజాశక్తి -నక్కపల్లి :నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాలకు గాను, నక్కపల్లి యూనిట్‌గా నిర్వహించిన ఎన్నికల్లో ఈ మండలాలకు సంబంధించి మండల పరిషత్, జిల్లా పరిషత్ హైస్కూల్ మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా జాయింట్ సెక్రెటరీ వై రామకృష్ణ వ్యవహరించారు. ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు రామకృష్ణ వెల్లడించారు. అధ్యక్షులుగా డి సీతారామరాజు (ఏవో,మండల ప్రజా పరిషత్,నక్కపల్లి), ఉపాధ్యక్షులుగా కె.సూరిబాబు, (జూనియర్ అసిస్టెంట్, జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్, డి.హెచ్ అగ్రహారం), కార్యదర్శిగా డివిఎస్ రాజకుమానందం రాజు, (జూనియర్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ హైస్కూల్, గుంటపల్లి), జాయింట్ సెక్రెటరీగా కె సుజాత, (టైపిస్ట్,ఎంపీపీ నక్కపల్లి), ట్రెజరర్‌గా సత్య నూకరత్నం, జిల్లా కౌన్సిలర్‌గా బి.లక్ష్మణరాజు (సీనియర్ అసిస్టెంట్, మండల ప్రజా పరిషత్,పాయకరావుపేట), జిల్లా కౌన్సిలర్-2గా ఎంఎన్ మూర్తి, (మండల ప్రజాపరిషత్, ఎస్ రాయవరం) లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా సంఘం అధ్యక్షులు సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి డి.సీతారామరాజు పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీవో బీ. చైతన్య, స్థానిక అధికారులు ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న నాయకులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాజాన వీర సూర్యచంద్ర తన సొంత నిధులతో గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పదో తరగతి అనేది జీవితంలో కీలక మలుపు అని, ఈ దశలో వేసే ప్రతి అడుగు భవిష్యత్‌కు ఆధారస్తంభం అవుతుందని తెలిపారు. కొద్దిసేపు క్రమబద్ధంగా చదివితే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చునని తెలిపారు. నేటి ప్రపంచంలో పోటీ తీవ్రమైన నేపథ్యంలో పాఠ్య పుస్తకాలతో పాటు నైపుణ్యాల అభివృద్ధి కూడా అవసరమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాదుల ప్రసాద్ బాబు, దేవి, మండల పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు దుంగల రమేష్, జనసేన యువజన అధ్యక్షులు వాసం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న గ్రామస్తులు

ఆలయ స్థలాన్ని రక్షించండి

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని మంచాల గ్రామంలో మోదకొండమ్మ ఆలయానికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి ఇనుప కంచె వేసారని, వారి నుంచి స్థలాన్ని రక్షించాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మోదకొండమ్మ ఆలయం సుమారు 32 సెంట్ల స్థలంలో ఉందని, ఆలయానికి దక్షిణాన సుమారు పది అడుగుల వెడల్పున స్థలాన్ని ఆక్రమించి ఇనప కంచె వేశారన్నారు. దీంతో గుడికి వెళ్లే భక్తులకు ప్రదక్షిణలు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామస్తుడు పాటూరి రమణ తోపాటు గ్రామస్తులు ఎస్సై బి సతీష్ కు ఫిర్యాదు చేశారు.

చలిసింగంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- రావికమతం:మండలంలో చీమలపాడు పంచాయతీ శివారు చలిసింగం గ్రామంలో కొత్తకోట పిహెచ్‌సి వైద్యాధికారులు గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారిని సురేఖ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో పది మందికి రక్త పరీక్షలు నిర్వహించారు.స్క్రబ్ టైఫస్ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ మాట్లాడుతూ, పొలం పనులు చేయు వారికి, మట్టిలో తిరిగి పనిచేయునప్పుడు ఈ క్రిములు కుట్టడంతో ఈ ఈ వ్యాధి సోకుతుందని ఆమె తెలిపారు. ఈ వ్యాధి సోకినపుడు తలనొప్పి, తీవ్రమైన జ్వరము, వంటి నొప్పులు, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. విస్తరణ అధికారి రామారావు మాట్లాడుతూ, ఈ వ్యాధి ఒకరి నుంచి వేరొకరికి శోకదని, ఇది అంటూ వ్యాధి కాదని తెలిపారు. జ్వరము తగ్గకపోతే తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించి, రక్త పరీక్షల చేసుకుని వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి జోషిని, లక్ష్మి, ఏఎన్ఎం భవాని, గోవింద, ఆశాలు పలువురు పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యులు

ఆరోగ్య సర్వే చేపడుతున్న విద్యార్థులు

సాగరంలో ఇంటింటా సర్వే

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరం ఆరోవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాగరం కాలనిలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి సామాజిక ఆర్థిక ఆరోగ్య స్థితిగతులను సర్వే నిర్వహించారు. ఈ సర్వే వివరాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారికి అందజేస్తామని ప్రోగ్రాం ఆఫీసర్ ఎం రామ్ కుమార్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా భూలోకమ్మ జాతర

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గుడ్డిప గ్రామంలో గ్రామదేవత భూలోకమ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి భక్తులు కిటకిటలాడారు. భారీ లైటింగ్, మందు గుండు సామాగ్రితో ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లను చేశారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గొంప ఎంపీయూపీ పాఠశాలలో కిషోర్ బాలికలకు బాల్య వివాహాలు - అనర్థాలపై అవగాహన కల్పించారు. పిల్లలు మేజర్ అయ్యేంత వరకు వివాహాలు చేయరాదని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్.కె దాలిమ్ బీబీ తెలిపారు. బాల్యవివాహాలు చేసుకోమంటూ పిల్లలచే ప్రతిజ్ఞ చేయించారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యులను సంప్రదించి, రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త రాజేశ్వరి, పాఠశాల సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

మాడుగుల:బాల్య వివాహాలు లేని సమాజమే లక్ష్యంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని సీడీపీవో జి.ఎర్రయ్యమ్మ అన్నారు. మాడుగుల జూనియర్ కళాశాలలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని 100 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.నారిబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి : ఐసిడిఎస్ ఆధ్వర్యంలో భాగంగా గురువారం అనకాపల్లి జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుధిర రాణి, సాంఘిక శాస్త్ర అధ్యాపకులు అర్జున్, ఎల్సిపిఓ రమాదేవి పాల్గొన్నారు.

మునగపాక : బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం అవుతాయని అంగన్వాడి సూపర్వైజర్లు కే అన్నపూర్ణ, ఎస్ కె మీరాబాయి అన్నారు. మండలంలోని నాగులపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు బొడ్డేడ లక్ష్మి, పి ఎల్ ఎల్ సరస్వతి పాల్గొన్నారు.

వడ్డాది : బాల్య వివాహ రహిత రాష్ట్రంగా గుర్తింపు తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందని రావికమతం సీడీపీఓ వి.మంగతాయారు అన్నారు. వడ్డాది జడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో సమావేశమయ్యారు. సూపర్వైజర్, నిర్మలా దేవి, అంగన్వాడీ టీచర్లు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగులలో అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ

కె.కోటపాడు : మండలంలోని దానివలస గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాల్లో యునైటెడ్ బాంబే ఎన్జీఓస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ భూమిరెడ్డి దేముళ్ళు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్ ఎల్.బి.సుశీల, విఆర్ఓ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : బాల్య వివాహ నిరోధక చట్టంపై స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులకు గురువారం అవగాహన కల్పించారు బాల్య వివాహ ముక్త్ భారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహనలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సాధికార అధికారి కెవి రామ లక్ష్మీ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సిడిపిఒ ఎం శ్రీదేవి, సూపర్వైజర్ బి నాగమణి మాట్లాడుతూ, బాల్య వివాహాల ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించరాదని స్పష్టం చేశారు. కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ గంగా కుమారి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు

పద్మనాభం.:మండలంలోని కృష్ణాపురం కస్తూర్బా పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాల నిర్మూలనకు కే. జి. బి.వి.స్కూల్లో బాలవివా ముక్త్ భారత్ ప్రోగ్రామ్ గురువారం నిర్వహించారు. స్కూల్లో బాలికలకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గ్రేస్ లిల్లీ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పార్వతి, జియో పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న నాయకులు

కూల్ డ్రింక్స్ పంపిణీ

ప్రజాశక్తి-రోలుగుంట:జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు పుట్టిన రోజు సందర్భంగా రోలుగుంట మండలం రత్నంపేట గ్రామంలో ఉపాధి శ్రామికులకు కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపద కేంద్రం మరమ్మతు పనులు పూర్తి

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగులలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో మరమ్మతు పనులు చేయడం జరిగిందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఇకపై డంపిగ్ యార్డ్‌కు కూడా ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గతంలో మోదమాంబ అమ్మవారి గుడికి వెళ్లే మార్గంలో చెత్త వేసే తోవను నిలిపివేసి కాలేజీ రోడ్డు వైపు పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు గ్రామపంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

గౌరీ పరమేశ్వర ఆలయంలో పూజలు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండల కేంద్రమైన రాయవరంలో గౌరీ పరమేశ్వర ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించినట్లు గౌరీ పరమేశ్వర కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలను నిర్వహించారు. ప్రతి సోమవారం అమ్మవారి ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి-రోలుగుంట:కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్ గురువారం రోలుగుంట ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు అంగవైకల్యం, మరణించిన కుటుం బాలకు ఎక్స్‌గ్రేషియా రూ.25లక్షలు ఇవ్వాలన్నారు. అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని చెప్పారు.

సూచనలు చేస్తున్న సిఇఒ

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

-ఉమ్మడి విశాఖ జడ్‌పి సిఇఒ నారాయణమూర్తి

ప్రజాశక్తి -నక్కపల్లి:పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి విశాఖ జడ్పీ సీఈఓ నారాయణమూర్తి పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. మండలంలో దోసలపాడు గ్రామంలో గురువారం ఎంపీడీవో బి.చైతన్య, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావులతో కలిసి ఐవిఆర్ఎస్‌లో ఫిర్యాదు మేరకు గ్రామంలో పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఇంటింటా తడి పొడి చెత్తను సేకరించాలని సూచించారు. తడి పొడి చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. పారిశుద్ధ్య మెరుగునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహరాజు, ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టీవీ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాలకు టీవీ వితరణ

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బిబి.పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.25వేల విలువైన టీవీని పూర్వపు విద్యార్థులు బహుకరించారు. ఈ పాఠశాలలో చదువుకొని వివిధ రంగాల్లో స్థిరపడ్డ పాతాళ నాగలక్ష్మి, మచ్చా పెంటారావు, పండూరి మణిబాబు, ఊడి రోహిణి కుమార్, నిట్టా లోవలక్ష్మి, దేవరాజు సూర్యకృష్ణ, గంధం వాణి, గంగల రత్నంలు ఈ టీవీని గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖరరావుకు అందజేశారు.

భాషా పండిట్ల ఉద్యోగోన్నతులపై హర్షం

ప్రజాశక్తి-పాడేరుటౌన్: గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో బోధిస్తున్న భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టిడబ్ల్యూటియు రాష్ట్ర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సూర్యనారాయణ, జి.శేషగిరిరావు, పాడేరు మండల శాఖ కార్యదర్శి ఒ.విజేంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘ కాలంగా పదోన్నతి లేకుండా ఒకే కేడర్‌లో పని చేస్తున్న 417 భాషా పండితులకు సర్కార్ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందన్నారు.

బలవంతంగా భూసేకరణ చేపట్టొద్దు

-స్టీల్‌ప్లాంట్ టౌన్ షిప్‌కు భూములు ఇచ్చేది లేదు- తేల్చి చెప్పిన రైతులు, నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి:బలవంతపు భూసేకరణ చేపట్టి, రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు తెలిపారు. మండలంలో నెల్లిపూడి గ్రామంలో ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్‌కు రెండవ విడత చేపట్టనున్న భూములను సంబంధిత రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. భూసేకరణను వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నెల్లిపూడి గ్రామానికి చెందిన రైతులు కొబ్బరి, మామిడి చెట్లు నుంచి వచ్చిన ఫల సాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారని, ఆ భూములను సేకరిస్తే రైతులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. మినీ కోనసీమ గా పేరుగాంచిన ఈ ప్రాంతం అనకాపల్లి జిల్లాలోనే ఉద్యాన పంటలు పండించడంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇటువంటి సారవంతమైన భూములను పరిశ్రమలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే పరిశ్రమలు ఏర్పాటు ఒక్కటే కాదని, వ్యవసాయ రంగాన్ని కూడా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ ప్లాంట్ భూసేకరణకు 2024 నవంబర్ 26 న ఇచ్చిన జీవో నెంబర్ 76 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుల కడుపు కొట్టి ఉపాధి దెబ్బ తీసి భూములు సేకరించి కార్పొరేట్‌లకు లాభాలు సమకూర్చడమే పనిగా పెట్టుకున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు సూరకాసుల గోవిందరావు, ఎం.రాజేష్, ఎ.రమేష్ రాజు, టి.జోగిరాజు, టి.వెంకటరాజు, కె.నాని, టి.అప్పలరాజు, బి.రాము, బి.గోవింద్, ఎస్.సాగర్, టి.పేర్రాజు, బి.తాతారావు, కె.రమణ,పి.కన్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు, రైతులు

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల మండలంలో పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేశారు. పంచాయతీ కార్మికులకు హెల్త్ అలవెన్స్ 4000 రూపాయలు ఇవ్వాలని, 1999లో కోర్టు ఇచ్చిన 551 జీవోలో గుర్తింపు కార్డులు, కనీస వేతనం 21000, పిఎఫ్ ఇఎస్ఐ అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఏ.ఓ. జి.గోపాల్‌రావుకి వినతి పత్రం అందజేశారు.సిఐటియు డివిజన్ నాయకుడు ఆర్ దేవుడు నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కె.భవాని, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇరట.నరసింహమూర్తి మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని, కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులకు అరకొర జీతాలు కూడా ప్రతి నెలా ఇవ్వలేదన్నారు. జీతాలు సకాలంలో రాక అప్పులు చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస వేతనాలు 21000, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, మూడు నెలల నుండి 8 నెలల వరకు జీతాలు పెండింగ్లో ఉన్నాయని, వాటిని వెంటనే కార్మికులకు చెల్లించాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, పంచాయతీ కార్మికులకు రక్షణ కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ యూనియన్ కార్యదర్శి ఏల్చూరి ఈశ్వరరావు, అప్పారావు, కామరాజు, కృష్ణ సూరిబాబు, అధిక సంఖ్యలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, కార్మికులు

సిల్క్ ఎక్స్‌పో వస్త్ర సంబరాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో -ఎగ్జిబిషన్ కం సేల్ గురువారం ప్రారంభమై ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల సాంస్కృతిక బంధాలను, వివిధ రాష్ట్రాల మగ్గాల ఉత్పత్తులను ఒకచోటకు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ దుస్తులు, డిజైనర్ చీర, బ్లౌజులు, కుర్తీలు తదితరాలు 50 శాతం వరకు తగ్గింపుతో ఒకేచోట అందుబాటులో ఉంచామని వివరించారు. మహారాష్ట్ర పైథానీ సిల్క్ చీరలు, కర్నాటక బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిడా సిల్క్, మధ్యప్రదేశ్ ప్రసిద్ధ చందేరి, మహేశ్వరి సిల్క్, హ్యాండ్ పెయింట్, బలుచారి, జమ్దానీ, తంగైల్, ఢకై మస్లిన్ సిల్క్, పశ్చిమ బెంగాల్ లినెన్ చీర కాంత వర్క్, స్టిచ్ చీరలు ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో వివిధ డిజైన్లు, విశిష్టమైన చీరలు, దుపట్టాలు, సల్వార్ మెటీరియల్ సరికొత్త రకాలు లభిస్తాయని పేర్కొన్నారు. మన్నిక కలిగిన పట్టు, నేత చీరలతోపాటు దుపట్టాలు, సల్వార్ మెటీరియల్స్ ఆకర్షణీయమైన రంగులలో లభిస్తాయని తెలిపారు. వీటిలో బీహార్ భాగల్పూర్ సిల్క్, గుజరాత్ సంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోలా, తమిళనాడు కంజీవరంతో పాటు ఎంబ్రాయిడరీ సిల్క్, జమ్మూ కాశ్మీర్ తాబి సిల్క్ చీరలు లభిస్తాయని వివరించారు. ఉత్తరప్రదేశ్ బనారస్ సిల్క్ చీరలు, జమ్దానీ, షిఫాన్ చీరలు, లక్నవి చికాన్ వర్క్, రాజస్థాన్ బంధిని, బంధేజ్, హ్యాండ్-బ్లాక్ ప్రింట్ చీరలు కూడా ప్రదర్శనలో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 11 నుండి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ప్రవేశం ఉచితం అని పేర్కొన్నారు. అన్ని డెబిట్, క్రెడిట్ కార్డులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

వెలంపేట మురికివాడలో పేదలకు బహుళ అంతస్తుల ఇళ్లు

ప్రజలతో మాట్లాడుతున్న జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 35వ వార్డు పరిధి వెలంపేట మురికివాడలో పేదలకు బహుళ అంతస్తుల ఇళ్లు నిర్మిస్తామని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. గురువారం వెలంపేట మురికివాడను ఆయన సందర్శించి ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ, తాము ఈ ప్రాంతంలో 50 ఏళ్లకు పైబడి నివసిస్తున్నామని, తమకు ఇళ్లు నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్‌ను కోరారు. దీనికి స్పందించిన కమిషనర్ ఇక్కడ నివసిస్తున్న పేదల కోసం పిపిపి మోడల్‌లో బహుళ అంతస్తులు నిర్మించి అందిస్తామన్నారు. వెలంపేట మురికివాడలో దాదాపు 170 కుటుంబాలు నివాసముంటున్నాయని, అందరికీ ఇల్లు నిర్మించేందుకు రూ.కోట్లలో ఖర్చవుతుందని, అందుకు పిపిపి మోడల్‌లో బహుళ అంతస్తులు నిర్మించి అందించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. దీని కోసం కొంత సొమ్ము నివాసితులు సమకూర్చుకోవాల్సి ఉన్నందున బ్యాంకు లోను సదుపాయం ఏర్పాటుచేస్తామని, అందుకు నివాసితులు ముందుకు వస్తే కొంత సొమ్ము బ్యాంకు లోన్ ద్వారా నెలనెలా కట్టవలసి ఉంటుందని తెలపగా నివాసితులు అంగీకారం తెలిపారు. ఈ పర్యటనలో డిసిపి హరిదాస్, ఎసిపి య్యూనీస్ లక్ష్మి, ఎపిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సతీష్‌కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎట్టకేలకు విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నియామకం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13 జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులను నామినేటెడ్ పద్ధతిలో ప్రభుత్వం నియమించింది. అందులో భాగంగా విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన దక్షిణ నియోజకవర్గం నాయకుడు వన్నంరెడ్డి సతీష్‌కుమార్‌ను నియమించారు.